రోబోటిక్స్‌తో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స

ఖైరతాబాద్, ఏప్రిల్ 15 : రోబోటిక్స్ విధానంతో దేశంలోనే మొట్టమొదటి మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని కేర్ ఆస్పత్రి కన్సల్టెంట్ రోబోటిక్ మోకాలు మార్పిడి సర్జన్ డాక్టర్ రవిచంద్ర వట్టిపల్లి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను సంప్రదాయ పద్ధతుల్లో చేస్తే 18 నెలల కాలంలో పలుమార్లు శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుందన్నారు. రోబోటిక్ విధానంలో ఒక్కసారి చేస్తే సరిపోతుందని, రోగి వెంటనే కోలుకుంటాడని తెలిపారు.

నిమ్స్ మేలో ఉద్యోగమేళా

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 15: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో బుధవారం యూసుఫ్‌గూడలోని నిమ్స్ మే క్యాంపస్ లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉద్యోగమేళా నిర్వహించనున్నారు. నిరుద్యోగ యువతకు వృత్తి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ఎమ్ఎస్ఎమ్ ఈ మంత్రిత్వ శాఖ, అసిస్టెన్స్ టూ ట్రైనింగ్ ఇనిస్టిట్యూషన్స్ (ఏటీఐ) పథకం కింద నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాల(ఈఎస్ డీ పీ ఎస్)లో భాగంగా ఈ ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు నైపుణ్య శిక్షణల ఇన్‌చార్జి వి. స్వప్న ఓ ప్రకటనలో తెలిపారు. 22 ప్రముఖ కంపెనీలు పాల్గొని నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్(ఎన్ ఎస్ క్యూ ఎఫ్) ప్రమాణాలకు అనుగుణంగా ఉద్యోగాలను అందించనున్నాయన్నారు. ఉద్యోగ అవకాశాలను అన్వేషించే ఏ రంగానికి చెందిన నిరుద్యోగ యువత అయినా హాజరు కావచ్చని తెలిపారు. బయోడేటా, సంబంధిత సర్టిఫికెట్లు, ఫొటోలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు వి. స్వప్న, నైపుణ్య శిక్షణల ఇన్‌చార్జి, 040_23633218/ 61, ఈ మెయిల్:swapna@ nims me. gov.inలో సంప్రదించాలన్నారు.

'భూ భారతి' పై రైతుల్లో అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఏప్రిల్ 15 : భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రైతుల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం కొత్త ఆర్ఓఆర్ చట్టంపై మండల తహసిల్దార్ లతో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీఓ వాసుచంద్రలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... భూ భారతి చట్టంపై ఎలాంటి సమస్యలు పరిష్కారం అవుతాయనే విషయం రైతులకు సూచించాలన్నారు. ఈ పోర్టల్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కొత్త చట్టంపై రైతుల్లో ఎలాంటి అభద్రతా భావం ఉండకూడదని, భూ భారతి ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకం ప్రజల్లో కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వారసత్వ భూ బదలాయింపు, సాదాబైనామా భూముల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భూ భారతిపై అవగాహన పెంచేందుకు భూ సమస్యలు తెలుకునేందుకు గ్రామాల్లో నిర్వహించే గ్రామ రెవెన్యూ సదస్సులకు హాజరు కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. మహిళా సాధికారత కోసం ఇందిరా మహిళా శక్తి పెట్రోల్ బంకు ల నిమిత్తం స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తహసీల్దార్లకు సూచించారు. తహసీల్దారు కార్యాలయాల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలన్నారు. రేషన్ కార్డులు, వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలి

తెలంగాణ ఓపెన్ స్కూల్ , ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణ కు సంబంధించి పకడ్బందిగా ఏర్పాట్లు చేయాలనీ, ఎట్టి పరిస్థితుల్లో కూడా పరీక్షా కేంద్రంలోనికి సెల్ ఫోన్లు అనుమతించకూడదని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మంగళవారం వికారాబాద్ కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్సు హాల్లో పరీక్షా కేంద్రాలచీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లకు తెలంగాణ ఓపెన్ స్కూల్, ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 8 సెంటర్లు ఏర్పాటు చేయగా ఓపెన్ స్కూల్ వికారాబాద్ రెండు సెంటర్లు, తాండూర్ ఒకటి, ఓపెన్ ఇంటర్ వికారాబాద్ మూడు సెంటర్లు, తాండూర్ రెండు సెంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటాయన్నారు. పరీక్షలు ఈనెల 20 నుండి 26వరకు ఉంటాయన్నారు.ఎక్కడ ఎలాంటి సమస్య రాకుండా జాగ్రత్తగా పరీక్షల నిర్వహణ జరగాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో కచ్చితంగా సీసీ కెమెరాలు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా , లైటింగ్, ఫ్యాన్స్ ఉండేవిధంగా పరీక్ష కంటే ముందు రోజే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా విద్యాధికారి రేణుకా దేవి ,డి ఎస్ పి లు శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, ఎ సి జి రామ్ రెడ్డి, ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ లు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి పై అధికారులతో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి

రంగారెడ్డి కలెక్టర్ సి నారాయణ రెడ్డి

ఆదిబట్ల,ఏప్రిల్ 15ః భూ భారతిని ప్రజల్లోకి తీసుకు పోయి అవగాహన కల్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి అన్నారు.మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో భూ భారతి,ఇందిరమ్మ ఇండ్లు,రాజీవ్ యువ వికాసం తో పాటు త్రాగు నీరు,ప్రభుత్వ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న యూనిఫామ్‌లపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మార్వోలు భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం అమలు పై అవగాహన కల్పించాలని అన్నారు.ఇప్పటికే భూ భారతిలో ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలకు అందుబాటులో ఉండేవిదంగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.నేటి నుండి ప్రతి రిజిస్ట్రేషన్ భూ భారతి ద్వారానే జరుగుతుందని అన్నారు.ముందుగా పైలట్ ప్రాజెక్ట్‌గా భూ భారతిని జిల్లాలో చేపట్టడానికి ముందుగా 8 నియోజకవర్గాలలో అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు.గ్రామాలలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్లు,రాజీవ్ యువ వికాసం,ఎల్ఆర్ఎస్ , విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూనిఫామ్‌లపై అధికారులు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.ఇందిరమ్మ లబ్దిదారులను ఇళ్లు నిర్మించుకునేలా అధికారులు ప్రోత్సహించాలని అన్నారు.గ్రామాలలో తాగు నీటి సమస్య,విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.సమస్యల పై ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్,డీఆర్‌డీఓ సంగీత, ఆర్డీఓలు,తహసీల్దార్లు,మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

డబుల్ ఇండ్లు ఇప్పిస్తామంటూ మోసం

- ఆర్డీవో సంతకాలు ఫోర్జరీతో పట్టాలు
- రూ.20 లక్షలు వసూలు.. పోలీసులకు బాధితుల ఫిర్యాదు

జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 15: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కొన్ని ఖాళీగా ఉన్నాయని, వాటిని ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా నుంచి సుమారు 20 ఏండ్ల కిందట బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలోని వెంకటగిరిలో నివాసం ఉంటున్న సంకర్షన్ దాస్ ప్లంబర్‌గా పనిచేస్తుంటాడు. గతంలో బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో పనిచేస్తున్న సమయంలో అక్కడ ఆఫీస్ బాయ్‌గా పనిచేసిన ఎ.నాగరాజురెడ్డి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తనకు జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసులో పనిచేస్తున్న ప్రదీప్‌రెడ్డి అనే వ్యక్తి తెలుసని, అతడికి ఉన్న పరిచయాలతో రాజేంద్రనగర్, మల్కాజిగిరి తదితర ప్రాంతాల్లో గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో ఖాళీగా ఉన్న వాటిని అలాట్ చేయిస్తానని నమ్మించాడు. ఒక్కో ఇంటికి రూ.4లక్షలు ఖర్చవుతుందని, అడ్వాన్స్‌గా రూ.2లక్షల చొప్పున ఇవ్వాలని చెప్పాడు. దీంతో గత ఏడాది ఏప్రిల్‌లో రూ.1.5 లక్షలు చెల్లించిన సంకర్షన్ దాస్ తనతో పాటు పనిచేస్తున్న మరో పది మందికి కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇప్పించాలని కోరాడు. దీంతో వారందరికీ ఇండ్లు ఇప్పిస్తానంటూ ప్రదీప్‌రెడ్డిని పరిచయం చేశాడు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేసిన నాగరాజురెడ్డి, ప్రదీప్‌రెడ్డి కొన్ని నెలల తర్వాత వారికి పట్టాలు ఇచ్చాడు. రాజేంద్రనగర్, మల్కాజిగిరి మండలాల పరిధిలో ఇండ్లు వచ్చాయంటూ ఆనందంతో ఇటీవల ఆయా ప్రాంతాలకు వెళ్లి చూడగా.. వారికి ఇచ్చిన పట్టాలు బోగస్ అని తేలింది. రాజేంద్రనగర్, మల్కాజిగిరి ఆర్డీవోల సంతకాలు ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన బాధితులు అక్కడి అధికారులను సంప్రదించగా.. తాము ఎలాంటి పట్టాలు జారీ చేయలేదని స్పష్టం చేశారు. దీంతో మంగళవారం పలువురు బాధితులు సీపీఎం జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యదర్శి సాయి శేషగిరిరావుతో కలిసి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు నాగరాజురెడ్డి, ప్రదీప్‌రెడ్డి తమ వద్ద నుంచి సుమారు రూ.20లక్షలు వసూలు చేశారని, తమతో పాటు పెద్దసంఖ్యలో బాధితులు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నేత సాయిశేషగిరిరావు మాట్లాడుతూ.. ప్రతి బస్తీలో డబుల్‌బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అనేక మోసాలు జరుగుతున్నాయని, సమగ్రమైన విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత సైకిళ్లకు హెచ్‌సీజీ దరఖాస్తుల ఆహ్వానం

సర్కార్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థినులకే అవకాశం

సిటీబ్యూరో, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): ప్రతి ఏటా వంద సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేస్తున్న హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్(హెచ్‌సీజీ) ఈ ఏడాది కూడా సైకిళ్ల పంపిణీకి సిద్ధమైంది. ఈ ఏడాది ఇప్పటికే 15 సైకిళ్లకు పైగా ఉచితంగా అందించింది. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థినులకు మాత్రమే ఉచితంగా సైకిళ్లను అందిస్తున్నట్టు హెచ్‌సీజీ ఫౌండర్ నందనూరి రవీందర్ తెలిపారు. జూన్ 3వ తేదీన జరిగే 'వరల్డ్ సైక్లింగ్ డే' సందర్భంగా ఉద్యోగాలకు ఇప్పటికీ సైకిళ్లపైనే వెళ్లే వారిని గుర్తించి సత్కరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. పర్యావరణ ముప్పు పెరుగుతున్న పరిస్థితుల్లో వాహన కాలుష్యం తగ్గించేలా పర్యావరణ ప్రేమికులు సైకిళ్లనే వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. నగరంలో సైక్లింగ్ వినియోగం పెంచేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, సైకిళ్ల అవసరం ఉన్న విద్యార్థినులు 98854 40308 నంబర్‌కు వివరాలను వాట్సాప్ చేయాలని సూచించారు. తమ టీమ్ ఆ వివరాలను పరిశీలించి అర్హత గల వారికి సైకిళ్లను అందిస్తుందన్నారు.

మహిళా అఘోరిపై కేసు.. ఆలస్యంగా వెలుగులోకి..

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 15 : రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన మహిళా అఘోరి (శివ విష్ణు బ్రహ్మ అల్లూరి అలియాస్ శ్రీనివాస్) మరోసారి వార్తల్లోకి ఎక్కింది. గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో అఘోరికి సంబంధించిన న్యూస్ చక్కర్లు కొడుతుండడం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం మోకిలా సీఐ వీరబాబు తెలిపిన కథనం ప్రకారం.. శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరు గ్రామ రెవెన్యూలోని ప్రగతి రిసార్ట్స్‌లో నివాసముంటున్న వినితా బీటీ (29) ఈ అఘోరిని సంప్రదించి వ్యక్తిగతంగా ఓ పుణ్యక్షేత్రం వద్ద పూజలు నిర్వహించాలని కోరడంతో అందుకు అఘోరిణి రూ.9 లక్షల 80 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నది. పూజ పూర్తయిన తర్వాత వినితా ఆన్‌లైన్ ద్వారా నగదు ముట్టజెప్పింది. అనంతరం అఘోరి మరికొంత నగదు డిమాండ్ చేయడంతో భయపడిన వినితా గత ఫిబ్రవరి నెలలో మోకిలా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసిన కొద్దిరోజుల తర్వాత తిరిగి వినితా బీటీ మోకిలా పోలీస్ స్టేషన్‌కు వచ్చి అఘోరి నుంచి తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, తనను డబ్బులు డిమాండ్ చేయడం లేదని.. కంప్లెయింట్ వెనక్కి తీసుకుంటానని చెప్పింది. అప్పటికే కేసు నమోదు చేశామని, బాధితురాలు వివరాలు గోప్యంగా ఉంచాలని కోరడంతోనే తాము వెల్లడించలేదని, ఇరువురు పరస్పర ఒప్పందంతోనే ఈ వ్యవహారం జరిగిందని సీఐ తెలిపారు.

జేఎన్టీహెచ్ వర్సిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్.. 13 మందికి ఉద్యోగాలు

జేఎన్టీహెచ్ వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్లేస్మెంట్ డ్రైవ్‌లో యూనివర్సిటీ కళాశాల కెమిస్ట్రీ విభాగానికి చెందిన 13 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. మంగళవారం ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జీ.వీ. నరసింహ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, కెమిస్ట్రీ విభాగం అధిపతి సత్యనారాయణలు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

– *కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 15*

గాలివానలతో అప్రమత్తంగా ఉండాలి

ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, ఏప్రిల్15(నమస్తే తెలంగాణ): వాతావరణంలో ఒక్కసారిగా అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, బాగా ఎండకాసే వేళ కొన్ని సర్కిళ్లలో ఒక్కసారిగా వర్షం కురుస్తున్నదని, కొన్నిచోట్ల గాలి ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నందున అధికారులు, సిబ్బందంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశించారు. మంగళవారం ముఖ్య అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన ముషారఫ్ క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులపై ఆరా తీశారు. గాలుల తీవ్రతతో సెంట్రల్, బంజారాహిల్స్, సౌత్ సర్కిల్ పరిధిలో అక్కడక్కడ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సిబ్బంది వాటిని సరిచేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అనంతరం ముషారఫ్ మాట్లాడుతూ.. అకాలవర్షం, గాలి ప్రభావం విద్యుత్ వ్యవస్థపై ప్రభావం ఉంటుందని, ఛీఫ్ ఇంజినీర్లు, ఎస్ఈలు వాతావరణ శాఖ చేసే బులెటిన్‌ను ఫాలో అవుతూ క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని, పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి జాప్యం ఉండొద్దని చెప్పారు.

కంటిపై గుచ్చుకున్న స్క్రూడ్రైవర్.. గాంధీలో తొలగింపు

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 15: ఓ యువకుడి కంటి పై భాగంలో దిగిన స్క్రూ డ్రైవర్‌ను గాంధీ దవాఖాన వైద్యులు తొలగించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి తెలిపిన ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన రంజిత్(21) ఎలక్ట్రికల్ మెకానిక్. అయితే అతడు ఈనెల 8వ తేదీన మెకానిక్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు స్క్రూడ్రైవర్ కుడి కంటి పైభాగంలో దిగింది. అదేరోజు చికిత్స నిమిత్తం బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేటు కంటి ఆస్పత్రిలో చేరగా.. అక్కడి వైద్యులు 9వ తేదీన నిమ్స్‌కు వెళ్లాలని సూచించారు. నిమ్స్‌లో పరిశీలించిన వైద్యులు 10న గాంధీ దవాఖానకు సిఫారసు చేశారు. దీంతో గాంధీ నేత్ర వైద్య విభాగం వైద్యులు అతడికి పరీక్షలు నిర్వహించి కంటికి ఎటువంటి గాయం కాలేదని, కంటి పైభాగంలో స్క్రూ డ్రైవర్ గుచ్చుకుందని నిర్ధారించారు. న్యూరో సర్జరీ విభాగం వైద్యులు సుమారు రెండు గంటలపాటు శ్రమించి అరుదైన ఆపరేషన్ చేసి స్క్రూడ్రైవర్‌ను విజయవంతంగా తొలగించారు. సర్జరీ అనంతరం రోగి కోలుకుంటున్నాడని, ఆరోగ్యం నిలకడగా ఉన్నదని ఆమె తెలిపారు. న్యూరో సర్జరీ వైద్యులను ఆమె అభినందించారు.

తాటిపర్తి సమస్యను పరిష్కరిస్తాం: ఆర్డీఓ

రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అనంతరెడ్డి

యాచారం, ఏప్రిల్15: మండలంలోని తాటిపర్తి గ్రామంలోని సర్వే నంబర్ 109, 114ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఆర్డీఓ అనంతరెడ్డి అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో తాటిపర్తి గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామంలోని 109, 114ల సర్వే నంబర్‌లో నెలకొన్న సమస్యను రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలోని సర్వే నంబర్ 104భూమిని కొలుస్తుండగా అట్టి భూమిని ఆనుకొని ఉన్న 109, 114సర్వే నంబర్‌ల కలిగి ఉన్న రైతుల పొలాల్లోకి భూసేకరణ చేయాల్సి ఉండగా, 104సర్వే నంబర్‌లో 516ఎకరాలకు సంబందించిన భూమిలో అధికారులు, పోలీసులు ఫెన్సింగ్ వేస్తుండగా సరిహద్దులు డిస్పూట్ రావడంతో రైతులు అడ్డుకున్న విషయం తెలిసిందే, దీనిపై తమ భూమిని తమకు చూపించాలని రైతులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అనంతరెడ్డి మాట్లాడుతూ..త్వరలో పూర్తి స్థాయిలో అటు ఫారెస్ట్, ఇటు రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. తరతరాలుగా నమ్ముకున్న భూమిని రైతులకు సర్వే చేసి కబ్జా చూపిస్తామని తెలిపారు. ఫారెస్టు, రెవెన్యూ సరిహద్దుల్లో తేడాలు రావడంతోనే సమస్య తలెత్తిందని తెలిపారు. బుధవారం ఫారెస్టు డీఐ ఆధ్వర్యంలో సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రైతులు, గ్రామస్తులు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యప్ప, ఏసీపీ రాజు, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, రైతులు, అధికారులు ఉన్నారు.

మహిళల భద్రతే ముఖ్యం..

ఘనంగా స్త్రీ సమ్మిట్ 2.0

స్త్రీ సమ్మిట్‌లో మాట్లాడుతున్న హెచ్‌సీఎస్‌సీ చైర్మన్ , సీపీ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రత, మహిళా సాధికారతే లక్ష్యంగా హైదరాబాద్ సిటీపోలీస్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(హెచ్‌సీఎస్‌సీ) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్త్రీసమ్మిట్–2.0 ఘనంగా జరిగింది. తాజ్‌డెక్కన్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, సిటీపోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్, హెచ్‌సీఎస్‌సీ చైర్మన్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశంలో బాలికల నిష్పత్తి తగ్గుతున్నదని, ఇది దేశప్రగతికి కొంత అవరోధంగా మారుతుందన్నారు. ప్రతీ ఇంట్లో, పనిచేసేచోట మహిళలపై వివక్షత పోవాలని పిలుపునిచ్చారు. నీతిఅయోగ్ లా డివిజన్ సీనియర్ స్పెషలిస్ట్ డా.భానుశ్రీవేల్‌పాండ్యన్ మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం నీతి ఆయోగ్ తన విభాగాలతో పాటు ఇతర శాఖలను కూడా ప్రభావితం చేస్తున్నదన్నారు. ఈ సదస్సులో 5 సెషన్లలో మహిళల భద్రత, చిన్న పిల్లల రక్షణ, సైబర్ సెక్యూరిటీ, అర్బన్ ఎన్విరానమెంట్, ఎమర్జెన్సీ ప్రిపేర్డ్‌నెస్ వంటి అంశాలపై చర్చ జరిగింది. విభిన్నరంగాలకు చెందిన మహిళలు, యువతులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సమ్మిట్‌లో భాగంగా విమెన్ సేఫ్టీవింగ్ డీసీపీ డా.లావణ్య చిన్నారులపై లైంగిక వేధింపులు తదితర వివరాలను తెలిపేలా ప్రజెంటేషన్ ఇచ్చారు. సెషన్ల సంయోజకులుగా నీహారిక మాల్‌పూర్, ఉమాసుధీర్, చేతనాజైన్, పూర్ణిమా కాంబ్లే, ఖ్యాతినిర్వాణె,గీతాగోటి, చారు వాలిఖన్నాలు వ్యవహరించారు. కార్యక్రమంలో ఐపీఎస్ అధికారులు దివ్యదేవరాజన్, వనిత దాట్ల, జెన్నిఫర్ లార్సన్, నిర్మలాకాంతి వెస్లీ, జాయింట్ సీపీ పరిమళహననూతన్, హెచ్‌సీఎస్‌సీ జనరల్ సెక్రటరీ సి.శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య పది, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులకు సూచనలిస్తున్న డీఆర్ఓ వెంకటాచారి

సిటీబ్యూరో, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో ఓపెన్ పది, ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఓపెన్ పది , ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై విద్య, రెవెన్యూ, పోలీస్, వైద్య, పోస్టల్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు జరిగే పరీక్షలకు 73 సెంటర్లలో మొత్తం15,068 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒకరు చొప్పున సిట్టింగ్‌స్క్వాడ్‌లు, చీఫ్ సూపరింటెండెంట్ లు, డిపార్ట్మెంటల్ అధికారులను నియమించామన్నారు. 7 రూట్లలో రూట్ అధికారులను కేటాయించామని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లను అనుమతించరాదన్నారు. హైదరాబాద్ లో ట్రాఫిక్ దృష్ట్యా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఈఓ ఆర్. రోహిణి , అదనపు డీసీపీ రామదాసు తేజావత్, మెడికల్, విద్యుత్, పోస్టల్, ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జలమండలి మోటర్ ఫ్రీ టాప్ డ్రైవ్

తొలి రోజే 64 మోటర్లు స్వాధీనం, 84 మందికి జరిమానా

సిటీబ్యూరో, ఏప్రిల్15, (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో అనుమతులకు విరుద్ధంగా మోటార్ వాడకం అరికట్టడానికి, నీటి వృధాను నివారించడానికి జలమండలి మంగళవారం 'మోటార్ ఫ్రీ టాప్' డ్రైవ్‌ను ప్రారంభించింది. మొదటి రోజే 64 మోటార్లను సీజ్‌చేయగా.. 84 మంది వినియోగదారులకు అక్రమంగా మోటార్లు ఉపయోగించి, నీటి వృథా చేసినందుకు జరిమానా విధించారు. అత్యధికంగా ఓ అండ్ ఎం డివిజన్ లో 6, ఎస్ఆర్ నగర్ పరిధిలో 25 మోటార్లు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి పైపులైన్ల ద్వారా మహానగరానికి తాగునీరు సరఫరా అవుతుంది. జలమండలి పర్యవేక్షణ లేమితో కొందరు వినియోగదారులు తమ నల్లాలకు అక్రమంగా మోటార్లు అమర్చి నీటిని తోడేస్తున్నారు. దీని కారణంగా మిగతా సామాన్యులకు తక్కువ ప్రెషర్‌తో నీరు సరఫరా అవుతున్నది. ఆలస్యంగా గ్రహించిన జలమండలి వారిపై చర్యలకు పూనుకున్నది. వినియోగదారులు తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే, నిబంధనల ప్రకారం.. జరిమానాతోపాటు మోటార్లు స్వాధీనం చేసుకుంటున్నారు. ఒకటికి రెండుసార్లు పట్టుబడితే కేసులు సైతం నమోదు చేయనున్నారు. నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలెదురైనా జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

డబుల్ ఇండ్లలోకి చేరకుంటే రద్దే

- మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో లబ్ధిదారులకు రెండుసార్లు నోటీసులు జారీ
- మరోసారి నోటీసులు ఇచ్చి రద్దు చేస్తామంటున్న అధికారులు

మేడ్చల్, ఏప్రిల్15(నమస్తే తెలంగాణ): కేటాయించిన డబుల్‌బెడ్ రూమ్‌లలో లబ్ధిదారులు చేరకుంటే రద్దుకు చర్యలు తీసుకోనున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఉన్న డబుల్‌బెడ్ రూమ్‌ల లబ్ధిదారులకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. ఈనెల 20లోపు మరోసారి నోటీసులు ఇచ్చి రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్‌లను ఇండ్లు లేని వారిని గుర్తించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రేటర్ పరిధిలోని వారికి అందించింది. జిల్లాలోని బండ్లగూడ, రాంపల్లి, జవహర్‌నగర్ పరిధిలోని ఆహ్మద్‌గూడ, తూంకుంట, శామీర్‌పేట్ మండలం మురహరిపల్లి, ప్రతాపసింగారం, కొర్రెముల, దుండిగల్‌లో వేలాది సంఖ్యలో డబుల్‌బెడ్ రూమ్‌లను నిర్మించి అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్‌లను కేటాయిస్తూ సర్టిఫికెట్లు అందించారు.

ఖాళీగా వేలాది ఇండ్లు ..

లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించినా వేలాది సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో 6,203 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించగా.. 1500 మంది లబ్ధిదారులు మాత్రమే చేరగా, మరో 4,500 ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. అత్యధిక సంఖ్యలో ఇక్కడే ఖాళీగా ఉన్నాయి. ప్రతాపసింగారంలో 2వేల మంది లబ్ధిదారులకు..1100 మంది లబ్ధిదారులు మాత్రమే చేరారు. మరో 900 ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. తూంకుంట మండలం మురహరిపల్లిలో 2,200 మంది, దుండిగల్‌లో 396 మంది, కొర్రెములలో 30 మంది లబ్ధిదారులు డబుల్‌బెడ్ రూమ్‌లలో చేరాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తలుపులు, కిటికీలు విరిగిపోతున్నాయని, దీంతో ఇబ్బందులు వస్తున్న క్రమంలో ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్‌లను ఖాళీగా ఉంచకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ప్రజాపాలనలో ఇండ్ల కోసం అనేక దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో డబుల్ ఇండ్లలో చేరిని వారి గుర్తింపును రద్దు చేసి ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారికి అందించేల చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

రద్దు చేస్తామని నోటీసు బోర్డు ఏర్పాటు

జీహెచ్‌ఎంసీ డబుల్‌బెడ్ రూమ్ లబ్ధిదారులకు మంజూరు చేసిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను ఈనెల 20వ తేదీ లోపు వచ్చి నివసించకుంటే మీకు ఇల్లు అవసరం లేదని భాంచి రద్దు చేయుటకు అధికారులకు సిఫారసు చేయనున్నట్లు జీహెచ్‌ఎంసీ బోర్డును ఏర్పాటు చేసింది.